క్లుప్తంగా

అభయాంజనేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్ద నున్న అభయాంజనేయుడికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చకులు నిర్వహించి, నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగాల పేరుతో రూ.21లక్షల టోకరా

మంగళగిరి: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు రూ.21 లక్షలకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదవడ్లపూడి చెందిన మహేంద్ర కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలోని స్నేహితులను కలిసి హైదరాబాద్‌లో ఉద్యోగాలు ఉన్నాయని చెప్పాడు. రూ.3 లక్షలు కడితే నెలకు రూ.20 వేల జీతంతో ఉద్యోగం పొందవచ్చని ఆశ పెట్టాడు. దీంతో ఏడుగురు యువకులు రూ.3 లక్షల లెక్కన రూ.21 లక్షలు మహేంద్రకు ఇచ్చారు. కొన్ని రోజులు తర్వాత అతను ఫోన్ ఎత్తకుండా ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వచ్ఛ దివస్ కరపత్రాలు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆదివారం తడి, పొడి చెత్తపై ప్రజలకు పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఆకు పచ్చ డబ్బాల్లో సహజంగా కుళ్లిపోయే కూరగాయలు, పండ్ల తొక్కలు, ఆకులు వంటివి వేయాలన్నారు. బులుగు డబ్బాలో పొడిచెత్త.. కుళ్లిపోయే స్వభావం లేని ప్లాస్టిక్స్, సీసాలు, లోహాలు, వస్త్రాలు వంటివి వేయాలని చెప్పారు. ఎర్ర రంగు డబ్బాలో ప్రమాద కరమైన సిరంజీలు, కాటన్, గ్లౌజులు, నాప్కిన్స్ వంటివి వేయాలని తెలిపారు. దీనిపై ఇంటింటికి తిరిగి వారికి వివరణతో కూడిన కరపత్రాలు అందజేశారు.

లక్ష్మణరావు గెలుపునకు ప్రచారం

తాడేపల్లిరూరల్: కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని ఆపార్ట్‌మెంట్లలో ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి మండల నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి, ప్రజా సమస్యలపై శాసన మండలిలో పోరాడే కేఎస్ లక్ష్మణరావుని గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, డీవైఎఫ్ఐ నాయకులు పల్లె భార్గవ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు జెట్టి రాంబాబు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాడేపల్లిరూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది, ఇతరులకు కూడా దైవజ్ఞానం తెలియజేయడం అని తెలిపారు. శివరాత్రిని మోక్ష రాత్రి అని వివరించారు. కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, ఆర్. రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి. బ్రహ్మం, పట్టాభి శ్రీను, జె. హరిబాబు, సుబ్బారావు, అరుణ పాల్గొన్నారు.

వరుస రోడ్డు ప్రమాదాలు ట్రాఫిక్ జామ్

దుగ్గిరాల: మండలంలో చింతలపూడి గ్రామ సమీపంలో తెనాలి–విజయవాడ ప్రధాన రహదారిపై ఆదివారం రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గంటల వ్యవధిలో ఈ ప్రమాదాల్లో మొత్తం నలుగురు గాయపడగా.. క్షతగ్రాతులను పోలీసులు స్థానిక తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదాలు చోటు చేసుకోవడం వల్ల గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసుల సిబ్బంది వెంటనే స్పందించి క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టి, పరిస్థితిని చక్కదిద్దారు.

పది..టార్గెట్ 100%

- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- మంగళగిరిలో 10 బడుల్లో 1,047 మంది పరీక్షలకు సన్నద్ధం
- ఇప్పటికే వంద రోజుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు



పరీక్షల సన్నద్ధంలో పదో తరగతి విద్యార్థులు

మంగళగిరి: విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది తరగతి పదవ తరగతి. 22 రోజుల్లో విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. అదనపు తరగతులతో ఇప్పటికే విద్యార్థులతో పునశ్చరణ చేయిస్తూ.. తీర్చిదిద్దుతున్నారు. మంగళగిరిలో మొత్తం 10 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిల్లో 1,047 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నిడమర్రు, నూతక్కి, చినకాకాని, నవులూరు, ఆత్మకూరు, రత్నాలచెరువు, పెదవడ్లపూడి, కేకే మున్సిపాలిటీ హైస్కూలు, సీకే బాలుర పాఠశాల, సీకే బాలికల పాఠశాలలున్నాయి.

గతేడాది ఫలితాలు ఇలా..

ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రీ ఫైనల్ ఫలితాలను బట్టి.. ఏ పాఠశాల ఉత్తీర్ణత శాతం మెరుగు పడుతుందో అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు మండలంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో రత్నాలచెరువు బీఎస్ఆర్ స్కూలు ప్రథమ స్థానంలో నిలిచింది. వీవర్స్ కాలనీ, చినకాకాని పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆత్మకూరు, సీకే, నవులూరు పాఠశాలలు వెనుకబడ్డాయి. 588 మార్కులను రత్నాల చెరువు స్కూలు విద్యార్థి సాధించగా, వీవర్స్ కాలనీ పాఠశాల విద్యార్థులు 571, 570 మార్కులతో పాటు 550కు పైగా 16 మంది, 500కు పైగా మార్కులు 60 మంది విద్యార్థులు సాధించారు. అన్ని పాఠశాలల్లో 267 మంది 550కు పైగా మార్కులు సాధించగా 348 మంది 500కు పైగా మార్కులు సాధించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది కంటే అధిక శాతం ఉత్తీర్ణత లక్ష్యాన్ని సాధించి, తమ సత్తాను చాటేందుకు విద్యార్థులు కష్టపడుతున్నారు.



చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పరీక్షలకు అంతా సిద్ధం..

పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో వెనుకబడిన పాఠశాలలపై విద్యాశాఖ ఈ ఏడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, స్నాక్స్, పౌష్టికాహారం అందజేసింది. మార్చి 17వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమై.. ఏప్రిల్ 1వ తేదీతో ముగుస్తాయి. హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విద్యార్థులు డౌన్‌లోడు చేసుకోవచ్చు. మండలంలో 5 పరీక్ష కేంద్రాలను అధికారులు కేటాయించారు. నిర్మల హైస్కూలు, అరవింద మోడల్ హైస్కూలు, వీవర్స్ కాలనీ, సీకే హైస్కూలు, కేకే మున్సిపల్ స్కూలు, నిడమర్రు, ఆత్మకూరుతో పాటు నూతక్కి సెల్ఫ్ సెంటర్ ఉంది. దూర ప్రాంతాల విద్యార్థులు ముందుగా పరీక్ష కేంద్రాలకు సొంత వాహనాలు, బస్సుల్లో రావాల్సి ఉంటుంది. ఉన్న ఈ కొద్ది సమయంలో వెనుకడబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థుల ఇళ్ల ఉపాధ్యాయులు వెళ్లి..వారిపై దృష్టి సారిస్తున్నారు.

లక్ష్య సాధణకు కృషి



గత ఏడాది పదో తరగతి విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతతం 257 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రీ ఫైనల్ పరీక్ష ఫలితాలను బట్టి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వంద శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, హెచ్ఎం, వీవర్స్ కాలనీ పాఠశాల

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని వారు ఆదివారం ప్రారంభించి, మాట్లాడారు. న్యాయమైన కార్మికుల సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని, ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. శిబిరంలో ఐశ్వర్య, బి.అంకయ్య, సూర్య ప్రకాష్, డి.మాణిక్యరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, రెహమాన్, నాగేశ్వరరావు, రమాదేవి, దుర్గాభవాని పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు మెండు



వేడుకల్లో పాల్గొన్న బిషప్ సుధీర్‌కుమార్

దుగ్గిరాల: మండలంలోని తుమ్మపూడిలో మార్తా నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ, జీఎన్ఎం మొదటి సంవత్సరం నర్సింగ్ విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ వేడుకలు ఆదివారం జరిగాయి. కళాశాల డైరెక్టర్ వై.ఈశ్వర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచానికి నర్సుల ఆవశ్యకత చాలా ఉందన్నారు. విదేశాల్లో మంచి ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. 10 వేల జనాభాకు కేవలం 16 మంది నర్సులు ఉన్నారని పేర్కొన్నారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పిన విధంగా నర్సింగ్ విద్యార్థులు రోగులకు ప్రేమతో సేవ చేయాలన్నారు. కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, కరస్పాండెంట్ వై.సమీర్‌చంద్ర, మేనేజర్ గిద్యాన్, ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డాగా కళాశాల ప్రాంగణం



దుగ్గిరాల: మండల కేంద్రంలోని డాక్టర్ కేఆర్ఎం డిగ్రీ కళాశాల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు ప్రాంగణంలో మందుబాబు తిష్ట వేస్తున్నారు. సేవించిన మద్యం సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. ప్రతి రోజు మద్యంతో పాటు సిగరెట్లు, గంజాయి వంటి మత్తుపదార్థాలు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల యాజమాన్యం ఉదాసీన వైఖరి వల్ల మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారని విమర్శిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. స్థానిక పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

విద్యుదాఘాతంతో దూడలు మృతి



దుగ్గిరాల: మండలంలోని పేరుకలపూడి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో రెండు దూడలు మృతి చెందాయి. గెదే సగానికిపైగా కాలిపోయింది. గంపల పాములు అనే వ్యక్తి పశువుల పాకలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో దాదాపు రూ.1,20,000 నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

రాజు మాస్టారు మరణం బాధాకరం

తాడికొండ: ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కొప్పుల రాజు మాస్టారు మరణం బాధాకరమని ఉపాధ్యా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో నిర్వహించిన ఆదరణ కూడికలో వారు పాల్గొన్నారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం బాబా సాహెబ్ జీవితం– భారత రాజ్యాంగం అనే పుస్తకాన్ని ఆవిష్కరించి అంకితం చేశారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభా వీరాంజనేయులు, కుంభ కోటేశ్వరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరు గ్రామంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవర్ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. తడి చెత్త, పొడిచెత్త సేకరణపై విస్తృత ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నెహ్రూ, ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దహనం చేసిన దుండగులు

తెనాలి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జి వద్ద నిలిపి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. లాడ్జిలో పని చేసే యువకుడి బైక్ దగ్ధమవుతూ పొగలు రావడాన్ని శనివారం రాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో లాడ్జిలో ఉన్న వారు గమనించారు. గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టి ఉంటారని వాహన యజమాని అనుమానిస్తున్నాడు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి వ్యక్తికి క్షమాగుణం అవసరం



ఫిరంగిపురం: ప్రతి వ్యక్తికి క్షమాగుణం అవసరమని విచారణ గురువు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం శ్రీసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ భగవంతుడిని ప్రేమించే ప్రతి వ్యక్తి తన శత్రువుని కూడా క్షమించే గుణం కలిగి ఉండాలన్నారు. తనలోని ద్వేషం, కోపం, పగ, పాపం వంటివి తప్పనిసరిగా వదిలి వేయాలని దానిద్వారా భగవంతుడిపై ప్రేమ కలుగుతుందన్నారు. భగవంతుడు తన శిష్యులతో మూడు విషయాలు వివరించాడని వాటిలో తన శత్రువుని ప్రేమించాలని, ద్వేషించేవారి కోసం ప్రార్థన చేయాలని, ఎవరు శపిస్తున్నారో వారిని ఆశీర్వదించాలన్నారు. ప్రతిరోజు దైవ ప్రార్థన చేయడం ద్వారా పాపం ప్రక్షాలన జరిగి భగవంతుడికి దగ్గరగా ఉంటారన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. సహాయ విచారణ గురువులు వి.రవీంద్ర, మఠకన్య స్త్రీలు, కథోలిక క్రైస్తవులు, పెద్దలు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

మంగళగిరి: మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికను చినకాకానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడికి ఇప్పటికే పెళ్లి అయి పిల్లలున్నారు. ఈ విషయాన్ని దాచి బాలికను మోసం చేయడంతో బాలిక బంధువుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా బాబు

తాడేపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్ తాడేపల్లి మండలాధ్యక్షుడిగా తంబీ బాబును నియమిస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం తాడేపల్లిలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సురేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, బి.భాస్కర్ ఆధ్వర్యంలో తంబి బాబుకు నియామక పత్రాన్ని అందజేశారు. సంఘ రాష్ట్ర సీనియర్ నాయకులు అద్దేపల్లి నాగేశ్వరరావు, ఇసుకపల్లి అనిల్, వడ్డేశ్వరం ప్రసాద్, ఇసుకపల్లి జోజిబాబు, పినపాటి శ్రీకాంత్, శ్రీహరి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తప్పు చేసే ముందు కుటుంబాన్ని తలుచుకోండి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ హరిబాబు

మంగళగిరి టౌన్: చెడు మార్గంలోకి వెళ్లే ముందు ఒక్కసారి కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు రౌడీషీటర్లకు సూచించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసుల నిఘా ఉంటుందని, ఘర్షణలకు, సెటిల్‌మెంట్లకు వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది బాబూరావు, సుధీర్ ఉన్నారు.

పార్టీకి కార్యకర్తలు, నాయకుల ఐక్యతే పునాది

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు, నాయకుల ఐక్యతే పునాది అని, రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం తప్పక వస్తుందని పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని నిడుముక్కల గ్రామంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు భవిష్యత్తులో పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడకుండా పార్టీ కోసం పనిచేయాలన్నారు. త్వరలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామ, మండల కమిటీల నియామకం జరగనుందని, అందరి ఆమోదం, ఏకాభిప్రాయంతో పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకులకు అందులో స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. చిన్నపాటి విభేదాలుంటే పక్కన బెట్టి పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంలో సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలిచి, ప్రతి కుటుంబానికి మేలు చేశారని గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు మొదలు.. దాడులతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తుండటం దుర్మార్గమన్నారు. అధికారం కోసం అలవికాని హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో మాత్రం పూర్తిగా చేతులెత్తేశారనేది బహిరంగ సత్యమన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలు తమ సత్తా ఏంటో చూపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఏసురత్నం, ఎంపీటీసీ బోడపాటి సుశీల, ధర్మరాజు వివిధ విభాగాల నాయకులు బాకి వెంకటస్వామి, గుంటి రఘువరన్, ముప్పాళ్ల మనోహర్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే పెదకొండూరు గ్రామంలోని కనకపుట్లమ్మ తల్లి దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, పాలక మండలి ఏర్పాట్లు పరిశీలించారు. మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మంగళగిరికి చెందిన చిలపల్లి వెంకటేశ్వరరావు, పార్వతీ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేయగా, విజయవాడకు చెందిన వి.అప్పారావు హేమలత దంపతులు రూ.50,116లు ఈవో సునీల్ కుమార్‌కు అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు అందించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటిన చంద్రిక



మెడల్స్‌తో బొల్లినేని చంద్రిక

మంగళగిరి టౌన్ : సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారిణి ప్రతిభ చాటి, పతకాలు సాధించిందని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ భాస్కరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక 84 కేజీల విభాగంలో మూడు పతాలు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రికను, కోచ్ నరేంద్రరాజును గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, ఏపీ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట వెంకటేశ్వరరావు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఓటర్‌కు కరపత్రం అందజేస్తున్న బాలరాజు

దుగ్గిరాల: మండలంలోని ఈమని, మోరంపూడి గ్రామాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటు కలిగిన పట్టభద్రులలను కలిసి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, వై.స్టాలిన్, వి.శేషగిరి, రామారావు, ఎ.పాములు, వై.బాబురావు, అమిరెడ్డి, శివాంజనేయులు, పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాగ రంజితంగా పంచరత్న గాన గోష్టి



రామస్వామిని గండ పెండేరంతో సత్కరిస్తున్న కనకదుర్గ దంపతులు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట భాగవతులు వారి వీధిలో గల అనిరుధ్ సదన్‌లో ఆదివారం వీణ గురువు పుచ్చా కనకదుర్గ ఆధ్వర్యంలో పంచరత్న గాన గోష్టిని ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, గుంటూరుకు చెందిన సంగీత విద్వాంసులు కలిసి శ్రీ త్యాగరాజస్వామి రచించిన ఘన రాగ పంచరత్న కృతులను గాత్రం, వీణ, వయొలిన్, మృదంగం, ఘటం వంటి వాయిద్య సహకారంతో ప్రేక్షకులను రంజింపజేశారు. పాటిబండ్ల జాన శాంతి, రాగంపూడి అమూల్య, అనఘాలు కీర్తనలను ఆలపించారు. వీణపై కనకదుర్గ, మాల్కోస్‌పై వాణి, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై సుధాకర్, ఘటంపై కిశోర్ సహకరించారు. పంచరత్న సేవ అనంతరం పుచ్చా కనకదుర్గ, శిష్య బృందం పద్మశ్రీ అన్నవరపు రామస్వామిని గండపెండేరంతో సత్కరించారు. కర్ణాటక సంగీత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు, అనేక మంది కళాకారులకు శిక్షణ ఇవ్వడంలో రామస్వామి చేసిన కృషిని అభినందించారు.

ఘనంగా నాంచారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మ పేటలోని పిల్లమర్రి వారి వీధిలో గల విశ్వనాథపల్లి నాంచారమ్మ తల్లి దేవస్థాన 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త కొండూరు అంకమరావు, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మహోత్సవాలు వేడుకగా జరిగాయి. కనకతప్పెట్లు, మేళతాళాల వాయిద్యాల నడుమ మహిళలు కలశాలు చేపట్టి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దేవాలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ గావించారు. ఆలయ ధర్మకర్త కామేశ్వరి మాట్లాడుతూ 24వ తేదీ మధ్యాహ్నం అమ్మవారికి పూజలతో పాటు భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు కార్యక్రమంలో కొల్లూరు నాగలక్ష్మి, నాంచారయ్య, శ్రావణ్‌కుమార్, పలువురు భక్తులు పాల్గొన్నారు.